పౌష్టికాహార కిట్లు అందజేత



పౌష్టికాహార కిట్లు అందజేసిన మెడికల్ ఆఫీసర్‌లు డా. పద్మావతి, డా. మమత

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి ప్రభుత్వ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిక్షయ్ మిత్ర కార్యక్రమంలో భాగంగా 100 మంది క్షయ వ్యాధి బాధితులకు మెడికల్ ఆఫీసర్‌లు డా. పద్మావతి, డా. మమత పౌష్టికాహార కిట్లు అందజేశారు. చికిత్స, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. క్షయవ్యాధి నివారించడానికి ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలు అవసరమని అన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మోహన్, రామకృష్ణ, కల్పన, రాజు, ప్లాన్ ఇండియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి నల్లాలకు మోటార్లు బిగిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

మోతీనగర్: వేసవి కాలంలో మంచినీటి సరఫరాలో లో ప్రెషర్ వల్ల అనుమతులు లేకుండా నల్లాలకు మోటార్‌లు బిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీజీఎం శివ అన్నారు. మంగళవారం మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు బస్తీ, కాలనీల్లో మూసాపేట జలమండలి అధికారులు తనిఖీలు చేపట్టారు. అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్‌లో పలు ఇళ్లల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన మోటార్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ అన్విత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని అరికట్టాలి



సమస్యను కార్పొరేటర్‌కు వివరిస్తున్న కాలనీ వాసులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ కల్యాణినగర్‌లో మంచి నీటి కాలుష్యాన్ని అరికట్టాలని కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు కాలనీ అధ్యక్షుడు వసంత్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్ వెంటనే అధికారులకు ఫోన్ చేసి సమస్యపై చర్చించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ పరిశోధక ప్రయోగానికి బ్రేక్‌త్రూ బహుమతి

రాయదుర్గం: హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సీఏఎస్‌ఈఎల్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రయోగానికి బ్రేక్‌త్రూ బహుమతి లభించింది. సీఏఎల్‌ఈఎల్‌టీలోని ఫ్యాకల్టీ డాక్టర్ భావనాగోంబర్ నేతృత్వంలోని బృందం ఈ మైలురాయి శాస్త్రీయ విజయంలో ముఖ్యమైన పాత్ర పోషించింది. విశ్వం యొక్క ప్రాథమిక స్వభావం గురించి అవగాహనను విస్తరించిన సీఈఆర్‌ఎన్‌లో పనిచేస్తున్న అంతర్జాతీయ శాస్త్రవేత్తల అత్యుత్తమ సహకారాన్ని బ్రేక్ త్రూ బహుమతి గుర్తిస్తుంది. కాగా డాక్టర్ భావనాగోంబర్ నాయకత్వంలోని బృందంలో బిస్నుప్రియసాహు, శ్రీనికేతన్ ఆచార్య నిర్వహించిన డార్క్ మ్యాటర్ శోధనల నుంచి ఇటీవలి ఫలితాలను 59వ రెన్ కాంట్రిస్ డియో రియోండ్-2025 సమావేశంలో ప్రదర్శించగా ఈ బహుమతిని ప్రకటించారు.

మహిళ మృతి ఘటనలో వైద్యుడి రిమాండ్

ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు

నిజాంపేట్: వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందిన కేసులో ఓ వైద్యుడిని రిమాండ్‌కు తరలించారు. ఆసుపత్రి యాజమాన్యంపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. గత సంవత్సరం జూలైలో బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రిలో సరస్వతి (43) కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేశారు. అనంతరం ఆమె మృతి చెందింది. సరస్వతి కుమారుడు ప్రమోద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. దీంతో వైద్యుడి నిర్లక్ష్యం వల్లే సరైన వైద్యం అందక మృతి చెందిందన్న నివేదిక ఆధారంగా పోలీసులు డా.సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా ఇందుకు బాధ్యులైన ఎస్‌ఎల్‌జీ ఆసుపత్రి యాజమాన్యంపై సైతం కేసు నమోదు చేశారు

ట్రాఫిక్‌తో నిత్యం నరకమే!

పర్వత్‌నగర్ చౌరస్తాలో వాహనదారుల అవస్థలు

- వీఐపీల రాకపోకల సమయంలోనే దర్శనమిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- మిగతా సమయంలో కనిపించని సిబ్బంది



పర్వత్‌నగర్ చౌరస్తాలో వాహనాల రద్దీ



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ చక్రబంధంలో వాహనదారులు, పాదాచారులు, సమీప నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో నరకం అనుభవిస్తున్నారు. హైటెక్ సిటీకి మార్గమధ్యన దారి కావడం, ఎర్రగడ్డ, బోరబండ, మోతీనగర్, అల్లాపూర్, శ్రీరామ్‌నగర్, మూసాపేట, కూకట్‌పల్లి పాటు నగరంలోని ఇతర ప్రాంత వాసులు నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా ప్రయాణిస్తుంటారు. చౌరస్తా మీదుగా కూకట్‌పల్లి వైపు కొన్ని సంవత్సరాల క్రితం బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో కూకట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలు బ్రిడ్జిపై నుంచి వెళ్తున్నాయి. దీంతో పర్వత్‌నగర్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌తో రాకపోకలు స్తంభిస్తున్నాయి. గంటల తరబడి ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని గతంలో పలుమార్లు సంబంధిత ట్రాఫిక్ ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బారికేడ్లు ఏర్పాటు చేయరూ!

ఉదయం, సాయంత్రం వేళల్లో కనీసం పర్వత్‌నగర్ లోపలకు వచ్చి పోయే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తే కొంత మేర ట్రాఫిక్ సమస్య తీరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిత్యం ఉండే విధంగా అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. వివిధ పనులపై వెళ్లే ప్రజలు, ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ట్రాఫిక్ వల్ల ఆలస్యంగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. తరచూ ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. చౌరస్తాలో ట్రాఫిక్ బూత్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులు నిరంతరం ఉండే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పర్వత్‌నగర్ వాసులు కోరుతున్నారు.

కనిపించని ట్రాఫిక్ సిబ్బంది

ట్రాఫిక్ సమస్య ఉన్న ప్రాంతం కూకట్‌పల్లి, మాదాపూర్ పరిధిలోకి రావటంతో వీవీఐపీలు వచ్చివెళ్లే సమయంలో మాత్రమే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది దర్శనమిస్తారు. మిగిలిన సమయాల్లో కనపడరు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో విద్యార్థులు అనేక ట్రాఫిక్ కష్టాలను ఎదుర్కోవల్సి వస్తోంది. నిత్యం ఈ ట్రాఫిక్ సమస్యతోనే దినచర్య ప్రారంభించాల్సి వస్తున్నదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

గంటల తరబడి..



నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నాం. ఉదయం, సాయంత్రం గంటల తరబడి వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. గతంలో పలుమార్లు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా పర్వత్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి. – సి. బ్రహ్మ, పర్వత్‌నగర్ నివాసి

సరిపడా బస్సులు లేక సతమతం

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు





మూసాపేట: జగద్గిరిగుట్ట, ఆల్విన్‌కాలనీకి వెళ్లే దారిలో బస్సులు తక్కువగా ఉండటంతో విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళల్లో బస్సులు తక్కువగా ఉండటంతో విద్యార్థులు బస్సులో వెళ్లాలంటే యుద్ధం చేయాల్సిందే అన్న విధంగా ఉంటుంది. విద్యార్థులు కూకట్‌పల్లి హైసింగ్‌బోర్డుకు వెళ్తుంటారు. ఎక్కే లోగా బస్సు కదులుతుండటంతో విద్యార్థులు, ప్రయాణికులు పోటా పోటీగా పరుగెత్తుకుంటూ వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఆల్విన్‌కాలనీ, జగద్గిరిగుట్టకు బస్సులు తక్కువగా ఉన్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒంటిపూట బడులు కావడంతో విద్యార్థులు మధ్యాహ్నమే ఇంటికి వస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బస్సులు ఇంకా తక్కువగా ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లోనే బస్సులు నడుస్తాయి. అవి కూడా సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం వేచి ఉన్నా బస్ ఎక్కాలంటే పెద్ద టాస్క్ అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమయానికి బస్సుల సంఖ్యను పెంచాలని కోరుతున్నారు.

13 మంది కెమిస్ట్రీ విద్యార్థుల ఎంపిక



ఉద్యోగ అవకాశాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రొఫెసర్లు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు ప్రముఖ ఔషధ సంస్థలో ఉద్యోగ అవకాశాలు పొందారు. వార్షికంగా 2.8 లక్షల వేతనంతో పాటు భీమా, గ్రాడ్యూటీ, ఇతర అలవెన్సులతో కూడిన ట్రైనీ ప్రోగ్రాంలో ఎంపికయ్యారు. తెలంగాణ లైఫ్ సెన్సెస్ స్కిల్లింగ్ ప్రోగ్రాంలో భాగంగా మొత్తం 13 మంది విద్యార్థులు సాయి లైఫ్ సైన్సెస్, అరాగెన్ లైఫ్‌సైన్సెస్ వంటి తదితర సంస్థలలో వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌తో పాటు సంవత్సరానికి సగటు వేతనం 2.8 లక్షలుగా ఉద్యోగం పొందారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని కెమిస్ట్రీ విభాగాధిపతి డా. బి. సత్యనారాయణను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జీ.వీ. నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. పద్మావతి అభినందనలు తెలిపారు.

సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వం పేదల కడుపు నింపుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారులైన దళిత కుటుంబం లక్ష్మమ్మ- భాస్కర్ ఆహ్వానం మేరకు మంగళవారం వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారుని ఇంట్లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, రాజిరెడ్డి, రామ్ నర్సయ్య, రామిరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, శ్రీదేవి, చంద్రవతి, లత, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీసీల సమావేశం

కూకట్‌పల్లి: నియోజకవర్గ బీసీల సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు నాయకులు శివప్రసాద్, డి రమేష్, సీహెచ్ కోటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యా గ్రౌండ్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

బండి రమేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

కూకట్‌పల్లి: అంబేద్కర్ జయంతి సందర్భంగా దయార్‌గూడలో నిర్వహించిన ర్యాలీలో గుర్రపు బగ్గీలో అంబేద్కర్ చిత్రపటం కనిపించకుండా అడ్డుగా కూర్చున్న బండి రమేష్ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ కూకట్‌పల్లి అధ్యక్షుడు బొట్టు విష్ణు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బగ్గీలో ఎవరి చిత్రపటం ఉందో చూసుకోకుండా బగ్గీ ఎక్కి కాలుమీద కాలు వేసుకొని ఫొటోలు దిగటం అంబేద్కర్‌ను అవమానించడమేనని అన్నారు. ఈ ఘటనపై అంబేద్కర్ వాదులు స్పందించాలన్నారు.

ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లో వార్షిక అకడమిక్ ఫెస్ట్

రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని క్యాంపస్‌లో అయిదురోజుల పాటు వార్షిక అకడమిక్ ఫెస్ట్ 'డిజైన్ సింక్' పేరిట నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఏడాది కాలంలో విద్యార్థులు తమలోని నైపుణ్యాలను చాటడానికి సంస్కృతి, సృజనాత్మకత, ఆవిష్కరణలను ఆవిష్కరించడానికి అవకాశం కల్పిస్తారు. ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ ఆధ్వర్యంలో 21వ తేదీన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి

కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సతీష్ గౌడ్, తండా వాసులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృత్ నగర్ తండా వాసులకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలా పక్కన 40 సంవత్సరాలుగా దాదాపు 130 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వర్షాకాలంలో పాములు, ఇతర విష జంతువులు, కలుషిత నీరు తరచుగా ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రభుత్వం 130 కుటుంబాలలో 65 కుటుంబాలకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించిందని గుర్తు చేశారు. మిగతా వారికి ఇళ్లు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గొడ నాయక్, మోత్యా నాయక్, పాండు నాయక్, సుదర్శన్ రెడ్డి, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీ సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తానన్నారు. ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవి, హార్టికల్చర్ డిపార్టుమెంట్ దాసు, ఎంటమాలజీ డిపార్టుమెంట్ నరసింహ, జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ నరేష్, ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ, వాటర్‌వర్క్స్ ఏఈ ప్రియాంక, సూపర్‌వైజర్ సరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నల్లాలకు మోటార్ కనెక్షన్ బిగిస్తే జరిమానా



అంజయ్యనగర్‌లో నల్లాలను తనిఖీ చేసిన వాటర్‌వర్క్స్ అధికారులు

మూసాపేట: నల్లాకు మోటార్ కనెక్షన్ బిగిస్తే కఠిన చర్యలు తప్పవని వాటర్‌వర్క్స్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం అంజయ్యనగర్, ప్రగతినగర్ ప్రాంతాల్లో తనిఖీ చేపట్టారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నల్లాకు మోటార్లు బిగించటం ద్వారా కింద ఉన్న వారికి నీరు సరిగా సరఫరా కావటం లేదని, నల్లాకు మోటారు కనెక్షన్ చేస్తే జరిమానా విధిస్తామన్నారు. నల్లాకు మోటార్లు బిగిస్తే 5 వేల జరిమానా విధిస్తామని, కార్లు, బైకులను పైపుల ద్వారా కడిగితే వెయ్యి జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పినిపే చిన్న అబ్బులుకు దళితరత్న అవార్డు



మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్‌తోటకు చెందిన పినిపే చిన్న అబ్బులుకు బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దళితరత్న అవార్డును అందజేశారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డు రావటం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వినతి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ యూసుఫ్‌నగర్‌లో కొన్ని నెలల నుంచి వీధి లైట్లు వెలగడం లేదు. దీంతో కార్పొరేటర్ సబిహా బేగంకు కాలనీవాసులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వీధిలైట్లు లేక రాత్రి వేళల్లో దొంగల బెడద, ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటున్నదని వారు వివరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో నార్లపురం నాగరాజు, ఎం. నరసింహ, సీఎస్ సైదులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

దుబ్బాక ఎమ్మెల్యేపై కాంగ్రెస్ ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోయాలని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు మంగళవారం కూకట్‌పల్లి ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాదు ప్రతాప్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. త్వరలో స్పీకర్, గవర్నర్‌లకు ఫిర్యాదు చేస్తామని శేరి సతీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మేకల మైఖేల్, కొండల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డి, దేవ సహాయం, అక్బరుద్దీన్, రాజు ముదిరాజ్, కొమ్ము బాబు, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణానికి రూ. 14 కోట్ల నిధులు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే వివేకానంద్



జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంట సర్కిళ్ల పరిధిలో సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టేందుకు మొత్తం రూ. 14 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయలన్నారు. గత పదేళ్లలో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా అక్కడక్కడ మిగిలిపోయిన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ఇంజినీరింగ్ ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, శిరీష, రూపా దేవి, ఏఈలు కళ్యాణ్, తిరుపతి, అనురాగ్, అశోక్, స్వాతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కుత్బుల్లాపూర్ జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ కాలనీలలో మంచినీటి సరఫరా, నీటి లభ్యత, భూగర్భ డ్రైనేజీ పనులు, నూతన పైప్ లైన్ల నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, వరద నీటి కాలువ, మంజీరా పైపులైన్ పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జలమండలి డీజీఎంలు రాజేష్, శ్రీకాంత్, రవీందర్ నాయక్, మేనేజర్లు రవి, శివ ప్రసాద్, మహేష్, ఈశ్వరయ్య, రోహిణి, ఝాన్సీ, రమ్య భారతి, పూజిత తదితరులు పాల్గొన్నారు.